నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
బుధవారం | మే 15, 2024 | www.navatelangana.com

ముధోల్‌లో 75.63 శాతం పోలింగ్

నవతెలంగాణ -ముధోల్

నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 6గంటల నుండి రాత్రి వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 75.63శాతం పోలింగ్ నమోదైనట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కోమల్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,54,579 ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,92,546 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 93995 పురుషులు, 98549 మంది స్త్రీలు, ఇద్దరు ఇతరులు ఉన్నారు. కుభీర్‌లో 76.54 శాతం, కుంటాల 77.39, నర్సాపూర్(జి) 76.19, భైంసా 68.84, లోకేశ్వరం 79.86, ముధోల్ 78.92, బాసర 80.91, తానూర్ 81.81 శాతం పోలింగ్ నమోదైనట్లు సంబంధిత అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో అత్యధికంగా తానూర్‌లో, భైంసాలో అత్యల్పంగా పోలింగ్ నమోదైంది.

ఆటో బోల్తా : ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ - బెజ్జూరు



మండలంలోని మొగవెల్లి గ్రామ సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. గూడెం నుండి బెజ్జూరుకు వస్తున్న ఆటో మొగవెల్లి గ్రామ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడినట్టు బాధితులు తెలిపారు. ఇందులో గోలేటి జనాబాయి(ఎలుకపెల్లి), సోనాబాలు (కృష్ణపెల్లి), సోనా హరీష్(కృష్ణపెల్లి)కు గాయాలయ్యాయి. నాగెపెల్లిలో ఆటో ఎక్కిన జనాబాయి మొగవెల్లి గ్రామ సమీపంలోకి రాగానే బోల్తా పడడంతో తలకు గాయాలయ్యాయి. వీరిని బెజ్జూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగం

- ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆరోపణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల 13న జరిగిన లోక్‌సభ ఎన్నికలలో అధికార కాంగ్రెస్ పార్టీ కుట్రలు, కుతంత్రాలు చేసిందని ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. మంగళవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మద్యాన్ని విపరీతంగా పంపిణీ చేసిందని, 'ఓటు వేసి రండి క్వార్టర్ బాటిల్ తీసుకుపోండి' అనే విధంగా వ్యవహరించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎంత అధికార దుర్వినియోగానికి పాల్పడ్డా బీజేపీ విజయం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో పదికి పైగా స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సిర్పూరు నియోజకవర్గంలో పోలింగ్ నాలుగు గంటల వరకే కావడంతో పోలింగ్ శాతం తగ్గిందన్నారు. ఒక గంట పోలింగ్ సమయం పెంచితే మరింత పోలింగ్ శాతం పెరిగేదని అన్నారు. ఈ విషయమై వారం రోజుల క్రితమే రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాతపూర్వకంగా వినతి చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇది పునరావృతం కాకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొంగ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, తాలూకా కన్వీనర్ వీరభద్రచారి, పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్, నాయకులు గోలెం వెంకటేష్, దెబ్బటి శ్రీనివాస్, రాపర్తి ధనుంజయ్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం : ఎమ్మెల్యే కోవలక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్ పార్లమెంటు స్థానాన్ని బీఆర్ఎస్ గెల్చుకుంటుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం మంగళవారం తన నివాసంలో కార్యకర్తలతో ఎన్నికల సరళిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు బీఆర్ఎస్ గెలుపు కోసం ఎంతగానో కృషి చేశారని అభినందించారు. వారి కృషికి తగ్గ ఫలితం పార్లమెంట్ ఎన్నికల్లో వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ పార్లమెంటు స్థానం బీఆర్ఎస్ వశం చేసుకోవడం ఖాయమని, దీనిలో ఎటువంటి అనుమానం అవసరం లేదన్నారు. మండే ఎండలో కూడా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పార్టీ గెలుపు కోసం కృషి చేశారని, భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టుకొని చూసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో సింగల్ విండో చైర్మన్ అలి బిన్ హైమద్, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి సలాం, నాయకులు భీమేష్, రవి, సుగుణాకర్, అశోక్, బలరాం పాల్గొన్నారు.

ఘనంగా చత్రపతి శంభాజీ మహారాజ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆరే సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో చత్రపతి శంభాజీ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ శివాజీ తర్వాత ఆయన వారసునిగా మరాఠా సామ్రాజ్యాన్ని సుభిక్షంగా పాలించాడన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేలా ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దానపెల్లి దాదారాం, జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కజీ, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగపూర్ మారుతి, కోశాధికారి ఎలుములే దిలీప్, సహాయ కార్యదర్శి బొట్టుపల్లి ప్రశాంత్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు పిప్రే సాయి, నాయకులు నాగపూర్ మనోహర్, భీమనకార్ పోషన్న, కోలే బాలాజీ, ఝాడే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌రూరల్ : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన టొల్లు నగేష్(30) కచ్‌కంటి గ్రామానికి ఫోన్‌లో మాట్లాడుతూ వెళు తున్నాడు. ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. కచ్‌కంటి గ్రామస్తులు బావిలో చూసి సమాచారం అందించారు. భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. మృతునికి కుమారుడు ఉన్నట్లు పేర్కొన్నారు.

పోలింగ్ 74.03 శాతం..!

- గతం కంటే మూడు శాతం అధికంగా నమోదు
- బోథ్‌లో అత్యధికం..సిర్పూర్(టి)లో అత్యల్పం
- మహిళల కంటే పురుషుల ఓటింగ్ శాతమే ఎక్కువ
- ఆదిలాబాద్ లోక్‌సభలో పోలైన ఓట్లు 12.21లక్షలు

ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో వెల్లువిరిసిన చైతన్యం..ప్రాముఖ్యతపై అధికారులు చేపట్టిన విస్తృత ప్రచారం సఫలీకృతమైంది. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన వజ్రాయుధాన్ని వినియోగించుకునేందుకు ఓటర్లు వరుసకట్టారు. ఫలితంగా గత లోక్‌సభ ఎన్నికల కంటే మూడు శాతం అధికంగా పోలింగ్ నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 ఎన్నికల్లో ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో 71.41శాతం ఓటింగ్ నమోదు కాగా.. తాజా ఎన్నికల్లో 74.03శాతం నమోదైంది. దీంతో గత ఎన్నికల కంటే అధికంగా నమోదు కావడంతో రాజకీయ పార్టీలు, అధికారవర్గాలు, ప్రజాస్వామ్య వాదుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ లోక్‌సభ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా ఇందులో బోథ్‌లో అత్యధిక పోలింగ్‌శాతం నమోదు కాగా.. సిర్పూర్(టి)లో అత్యల్పంగా నమోదైంది. అన్ని నియోజకవర్గాల్లోనూ 70శాతంపైగానే నమోదు కావడం గమనార్హం. ఇదిలా ఉండగా ఓట్ల పరంగా మహిళలు అధికంగా ఉండటం..వినియోగంలో మాత్రం పురుషులదే పైచేయిగా మారింది.



ఓటేసేందుకు మోడల్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ లోక్‌సభ ఎన్నికల సమరం సమాప్తమైంది. ఓటు ప్రాముఖ్యతను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జనాలు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వరుసకట్టారు. సోమవారం నిర్వహించిన ఎన్నికల క్రతువులో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా కేంద్రాల్లో బారులు తీరి కనిపించారు. దీంతో సాయంత్రం 5గంటల వరకు పోలింగ్‌శాతాన్ని త్వరగానే వెల్లడించిన అధికారులు చివరగా 6గంటలకు వెల్లడించాల్సిన పోలింగ్‌శాతంలో మాత్రం ఆలస్యం చోటుచేసుకుంది. అర్ధరాత్రి వరకు కూడా పూర్తి పోలింగ్ నమోదు శాతాన్ని వెల్లడించలేదు. బుధవారం మధ్యాహ్నం వరకు పోలైన ఓట్లతో పాటు పూర్తిశాతాన్ని అధికారికంగా తెలియజేశారు. తాజాగా ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో 74.03శాతం నమోదు కావడంతో అధికారుల శ్రమ ఫలించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్వీప్, కళాజాత బృందాలతో ప్రచారం నిర్వహించడం.. ఓటు ప్రాముఖ్యతపై తెలియజేయడంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా జనాలు సొంతూళ్లకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బోథ్‌లో అత్యధికం..సిర్పూర్‌లో అత్యల్పం..!

ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలో 16,50,175 ఓట్లు ఉండగా ఎన్నికల్లో 12,21,563 ఓట్లు పోలయ్యాయి. మరో సుమారు 4.30లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. ఇందులో పురుషుల ఓట్లు 8,04,875 ఉండగా 5,99,108మంది..మహిళల ఓట్లు 8,45,213 ఉండగా 6,22,420 మంది వినియోగించుకున్నారు. ఇతరులు 87మంది ఓటర్లు ఉండగా 35మంది ఓటు వేశారు. మరోపక్క ఇందులో బోథ్ నియోజకవర్గంలో అత్యధికంగా 78.16శాతం మంది ఓటు హక్కును వినియోగించుకోగా.. సిర్పూర్(టి) నియోజకవర్గంలో మిగితా వాటి కంటే అత్యల్పంగా 71.56శాతం నమోదైంది. కానీ మిగితా అన్ని నియోజకవర్గాల్లోనూ 70శాతానికి పైగానే పోలింగ్ శాతం నమోదైంది.ఇదిలా ఉండగా పోలింగ్‌శాతం అనుకున్న విధంగానే నమోదు కావడంతో గెలుపోటములపై అభ్యర్థులు అంచనా వేసుకుంటున్నారు. ఎక్కడ అధికంగా పోలైంది..ఏయే ప్రాంతాల్లో తక్కువగా నమోదైందో ఆరా తీస్తున్నారు. పోలింగ్ సరళి జరిగిన తీరును బట్టి ..ఆయా సామాజిక వర్గాల వారీగా బేరీజు వేసుకుంటూ అప్పుడే ఓ అంచనాకు వస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క పెరిగిన పోలింగ్ ఎవరి విజయానికి దోహదం చేస్తుంది.. ఎవరి ఓటమికి కారణమవుతుందో ఫలితాల రోజున తేలిపోనుంది.

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
సిర్పూర్	2,29,101	163944	71.56
ఆసిఫాబాద్	2,27,208	1,71,511	75.49
ఖానాపూర్	2,24,523	1,62,101	72.20
ఆదిలాబాద్	245137	181136	73.89
బోథ్	2,11,313	1,65,157	78.16
నిర్మల్	2,58,314	1,85,168	71.68
ముధోల్	2,54,579	1,92,546	75.63
మొత్తం	16,50,175	12,21,563	74.03

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

- ఇద్దరు కొడుకులను కోల్పోయిన తల్లిదండ్రులు





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఫ్యానుకు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ మండలానికి చెందిన కొలపూరి నవీన్(27) పట్టణంలోని ఓ వైద్యుడు దగ్గర కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పట్టణంలోని కైలాష్‌నగర్‌లోని గజిటెడ్ ఆఫీస్ సంఘ భవనంలో నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం స్నేహితుడు పవన్ రూముకు వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించడంతో ఒక్కసారిగా ఖంగుతున్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వన్ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ప్రేమ వ్యవహారమే యువకుడి ఆత్మహత్యకు కారణమని భావిస్తున్నారు. యువకుడు చిన్న వయసులోనే అనంతలోకాలకు వెళ్లడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికొచ్చిన కొడుకు చేజారిపోయాడని తల్లిదండ్రులు మృతదేహంపై పడి రోదించారు.

చిన్న వయస్సులోనే ఇద్దరు కొడుకులు దూరం

సిరికొండ మండలంలో నివసిస్తున్న కొలపూరి లింగన్న - దేవుబాయి దంపతులకు ముగ్గురు సంతానం. బీద పరిస్థితిలో ఉన్న వీరు కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కొడుకులు గణేష్, నవీన్, ఒక కూతురు రాజమణి ఉన్నారు. కూతురుకు పెళ్లి చేసి తల్లిదండ్రులు తమ బాధ్యతను పూర్తి చేశారు. ఇక మిగిలిన ఇద్దరు కొడుకులలో పెద్ద కొడుకు గణేష్ 2006లో గణేష్ నిమజ్జన వేడుకల్లో ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందారు. చిన్న కొడుకు నవీన్ తల్లిదండ్రులను అన్నీ తానై చూసుకుంటున్నాడు. ఆదిలాబాద్ పట్టణంలోనే ఉంటూ ఓ ప్రముఖ వైద్యుడి దగ్గర పని చేస్తూ తల్లిదండ్రులను చూసుకుంటున్నాడు. ఇంతలోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో చేతికొచ్చిన కొడుకు ఇక లేడని తట్టుకోలేకపోతున్నారు. చేతికొచ్చిన ఇద్దరు కుమారులకు వివాహాలు చేసి సంతోష పడే అదృష్టం తమకు లేకపోయిందని ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్య తీసుకోవాలి : టీఎస్‌యూటీఎఫ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల విధులు నిర్వహించిన సిబ్బందికి తక్కువ రెమ్యునరేషన్ ఇచ్చినందుకు ప్రశ్నించిన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ఇతర ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాంతికుమారి, ఇందురావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి జీవో నెంబర్ 61 ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాల్సి ఉన్నప్పటికీ దానికి విరుద్ధంగా ఆర్డిఓ రూ.2400 మాత్రమే చెల్లించారని, పక్కన సిద్దిపేట గజ్వేల్ నియోజకవర్గాల్లో రూ.3150 చెల్లించారని తెలిపారు. ఈ తేడా ఎందుకని ప్రశ్నించినందుకు లాఠీచార్జి చేయించారని తెలిపారు. హక్కుల కోసం అడిగిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన ఆర్డిఓపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ప్రకటనలో హెచ్చరించారు.

యథేచ్ఛగా మట్టి దందా..!

- చెరువులను తోడేస్తున్న అక్రమార్కులు
- పొద్దంతా నల్ల మట్టి, రాత్రి పూట మొరం తరలింపు
- పట్టీపట్టనట్టు రెవెన్యూ అధికారులు



రాత్రి పూట ట్రాక్టర్‌లో మట్టి తరలింపు



చెరువులో మట్టి తవ్వకాలు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని జామ్, అడెల్లి, సారంగాపూర్ గ్రామ శివారులో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. ఎక్కడ పడితే అక్కడ లేఅవుట్ లేకుండానే వెంచర్లు వెలుస్తున్నాయి. వీటికి తోడు గృహ నిర్మాణాలకు మొరం, మట్టి అవసరం కావడంతో ఈ వ్యాపారం అక్రమార్కులకు పంట పండిస్తోంది. పగలు పంట చెనులోను నల్లమట్టి, రాత్రి పూట మొరం యథేచ్ఛగా వెంచర్లకు రవాణా అవుతోంది. మండలంలోని అడెల్లి జలగల చెరువు, జామ్ గ్రామంలోని నాగమ్మ చెరువు, కోమటి చెరువుల మట్టి తరలిపోతోంది. పగలూ రాత్రి తేడా లేకుండా మట్టి ట్రాక్టర్లను యథేచ్ఛగా వెంచర్లకు తరలిస్తున్నారు. మొరం తరలింపులో కొందరు రాజకీయ నాయయలు, ప్రజాప్రతినిధులు ఉన్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ వ్యవహారం బహిరంగంగానే సాగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు. ఒకవేళ పట్టుకున్నా సామాన్యుల వాహనాలను పట్టుకొని జరిమానాలు విధిస్తున్నారు.

అక్రమార్కుల అడ్డగోలు దందా

మొరం, మట్టి తరలింపు యథేచ్ఛగా కొనసాగుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. చెరువుల తూము సమీపంలో మట్టి తవ్వకాలు చేపట్టడంతో వర్షాకాలంలో నీటి సామర్థ్యం తట్టుకోలేక గండిపడే ప్రమాదం పొంచి ఉంది.ప్రభుత్వ, ప్రయివేటు భూముల్లో మొరం, మట్టి తవ్వకాలు చేపట్టాలంటే మండల రెవెన్యూ, భూగర్భ శాఖాధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఈ మేరకు వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించి తవ్వకాలు చేపట్టాలి. కానీ ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువుల నుండి మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. సహజ సంపదను అక్రమార్కులు కొల్లగొట్టి ఖజానా నింపుకుంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువులు, అసైన్డ్ భూముల్లో తవ్వకాలు సాగిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు లక్షల్లో భారీ గండి పడుతోంది. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే సంబంధిత ట్రాక్టర్ వ్యాపారులకు ముందుగానే సమాచారం అందించి తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతున్నారనే విమర్శలున్నాయి. అక్రమార్కులకు రెవెన్యూ అధికారులు పరోక్షంగా సహకరిస్తున్నారని మండల వాసులు పేర్కొంటున్నారు.



గ్రామ శివారులో వెంచర్

అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం : తహసీల్దార్ శ్రీదేవి

అనుమతులు లేకుండా మొరం, మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. వ్యక్తులు ఎంతటి వారైనా అక్రమంగా సహజ వనరులను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం.



ప్రొక్లెయినర్‌తో తవ్వకాలు

జన్మదినం సందర్భంగా మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ప్రముఖ ఆదివాసి కళాకారుడు, సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కళ్లె శ్రీధర్ తన జన్మదినం సందర్భంగా వినూత్నంగా ఆలోచించాడు. బర్త్ డే కేక్ కట్ చేయడం, కేక్ మిత్రులకు పంచడం కన్నా, ఎండల తీవ్రత వల్ల ఇబ్బందులు పడుతున్న వారికి తనవంతుగా ఏమైనా సహాయం చేయాలని, మండల కేంద్రంలోని నిర్మల్ బస్టాప్ వద్ద సుమారుగా 200 మందికి మజ్జిగ పంపిణీ చేశాడు. ఈ కార్యక్రమంలో నిర్మల్ బస్‌స్టాప్ కంట్రోలర్ లక్ష్మణ్, యువకులు నిఖిల్, వివిధ గ్రామాల ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.



జన్మదినం వేళ యువతి రక్తదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.నరేందర్ రాథోడ్ కూతురు ఖుషి రాథోడ్ జన్మదినం సందర్భంగా రిమ్స్‌లో రక్తదానం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ రక్తనిధి కేంద్రంలో ఆమెతో పాటు పలువురు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. రిమ్స్‌లోని సత్యసాయి అన్నదాన కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పుట్టినరోజు వేళా రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా.రాథోడ్ నరేందర్ అనురాధ దంపతులు, నటుడు అభినవ్ సర్దార్, వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండారి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుధ్య లోపం.. పట్టించుకోని అధికారులు..

- రోడ్లపై నిలిచిన మురుగు నీరు.. వెదజల్లుతున్న దుర్గంధం



వాటర్ ట్యాంకు వద్ద మురుగు కాలువ నిండి ఒక చోట చేరిన నీరు

నవతెలంగాణ-లోకేశ్వరం

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం లోపించడంతో పాటు వార్డుల్లో దుర్గంధం వేదజల్లుతోంది. ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీలను పరిశుభ్రంగా ఉంచి, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా, వ్యాధుల వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామాలు అపరి శుభ్రంగా మారుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవడంతో పాటు వ్యాధుల భారిన పడి ఆస్పత్రుల్లో డబ్బు ఖర్చు చేస్తున్నారు. మండలంలోని హాద్గాం గ్రామపంచాయతీకి అనుబంధ గ్రామం పొట్టపల్లి(ఎం)లో సకాలంలో అధికారులు మురికి కాలువల పూడిక తీయడం లేదు. దీంతో చెత్తా చెదారంతో మురికి కాలువలో పేరుక పోయి మురుగు నీరు సక్రమంగా ప్రవహించకుండా రోడ్డుపై నుంచి మురికి నీరు స్థానిక జనవాసాల్లోకి వచ్చి చేరుతోంది. మురికి నీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం సమయంలో భరించలేని దుర్వాసన వస్తుందని, దోమలు, ఈగలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయం స్థానిక గ్రామపంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినట్టు గ్రామస్తులు తెలిపారు. వేసవిలోనే మురుగు కాలువలు నిండి రోడ్లపై మురుగు నీరు వస్తుందంటే వర్షాకాలంలోనైతే తీవ్రత ఎక్కువ ఉంటుందని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మురుగు కాలువల పూడిక పనులు చేపట్టి, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నాం..

గంగాధర్, పొట్టపెల్లి(ఎం)



మురుగు కాలువ పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. దీంతో దుర్వాసన వస్తుంది. అధికారులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. దుర్గంధం వెదజల్లుతోంది. ఇంటి తలుపులు మూసుకొని నివసిస్తున్నాం. అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలి.

మురుగు నీరు రోడ్లపై ప్రవహించడం వాస్తవమే...

భోజన్న, పంచాయతీ కార్యదర్శి



మురుగునీరు రోడ్లపై ప్రవహించడం వాస్తవమే. లోతట్టు ప్రాంతం కావడంతో అక్కడ మురుగు వచ్చి ఆగుతోంది. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో చేపట్టారు అప్పుడే కల్వర్టు నిర్మాణ పనుల్లో సమస్య కారణంగా మురుగునీరు సక్రమంగా ప్రవహిస్త లేదు. స్థానిక ప్రజలు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసువచ్చారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

దోమల బెడద ఎక్కువగా ఉంది

సాయికుమార్, పొట్టపెల్లి(ఎం)



గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, మురుగు కాలువలను శుభ్రం చేయించాలని కోరుతున్నాం.

'మాజీ మంత్రిని అడ్డుకోవడం సమంజసం కాదు'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి మాజీ మంత్రి జోగు రామన్న సారథ్యంలో, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందని, ప్రజలకు కనీస వసతులను కల్పించడమే కాకుండా సమగ్రాభివృద్ధి సాధ్యమైందని బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి సాజిదోద్దీన్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఖానాపూర్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద మాజీ మంత్రి జోగు రామన్నను కాంగ్రెస్ నాయకులు అడ్డగించడం సమంజసం కాదని అన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేశామన్నారు. కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రిని అడ్డుకుని ప్రశ్నించడం ఎంతమేరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజులు దాటినప్పటికీ పూర్తి స్థాయిలో గ్యారంటీలను అమలు చేయకపోవడం వారి అసమర్థ పాలనకు నిదర్శనమని అన్నారు.

లక్ష మెజారిటీతో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ వందశాతం గెలుపు ఖాయమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. తన గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారని చెప్పారు. ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ లక్ష మెజార్టీతో విజయం సాధిస్తున్నామని విశ్వాసం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని చేయడం ప్రతి ఒక్కరి లక్ష్యమని తెలిపారు. తమకు ఏ పార్టీ పోటీ కాదని, పదేండ్లు బీఆర్ఎస్, బీజేపీ ఆదిలాబాద్‌కు చేసిందేమిలేదని విమర్శించారు. మతకల్లోలాలు సృష్టించేందుకు పాయల శంకర్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాయని చెప్పారు. గిరిజన లంబాడాలు అక్కున చేర్చుకున్నాయని, ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆత్రం సుగుణ హామీ ఇచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు ఉన్నారు.

ఉపాధ్యాయులపై దాడి హేయమైన చర్య

నవతెలంగాణ-నిర్మల్

పోలింగ్ విధులు ముగించుకొని వచ్చిన ఉపాధ్యాయులపై దాడి చేయడం హేయమైన చర్య అని పీఆర్టీయూటీజీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి యాటకారి సాయన్న, వోడ్నాల రవిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఎన్నికల విధులు ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడాన్ని నిర్మల్ జిల్లా శాఖ పూర్తిగా ఖండిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి సమాన రెమ్యూనరేషన్ ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ, తక్కువ డబ్బులు ఇస్తూ, ఎందుకు తక్కువ ఇస్తున్నారని ప్రశ్నించినందుకు ఉపాధ్యాయులపై లాఠీ ఛార్జ్ చేయడం హేయమైన చర్య అని ప్రశ్నించారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి, ప్రతికూల పరిస్థితులను సైతం ఎదుర్కొని ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించిన అధికారులకు ఇచ్చే బహుమానం ఇదేనాని ప్రశ్నించారు. ఉపాధ్యాయులపై ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, కారకులైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉపాధ్యాయుల తరపున వారికి న్యాయం జరిగే వరకూ ఉద్యమించడానికి, సిద్ధంగా ఉంటుందని హెచ్చరించారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో...

ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జి చేయించడాన్ని టీఎస్‌యూటీఎఫ్ నిర్మల్ జిల్లా శాఖ తీవ్రంగా ఖండిస్తున్నదని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి కారకులైన ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచల భద్రత : ఎస్పీ

- కౌంటింగ్ వరకు 24 గంటల పటిష్టమైన భద్రత ఏర్పాటు
- సీసీటీవీ కెమెరాలతో అదనపు భద్రత పర్యవేక్షణ
- స్ట్రాంగ్ రూముల భద్రత సిబ్బంది విధులను పరిశీలించిన ఎస్పీ



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసిన సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచల భద్రతను ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. మంగళవారం ఉదయం స్థానిక టీటీడీసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూముల వద్ద భద్రతా చర్యలను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా మూడు ప్రాంతాలలోని స్ట్రాంగ్ రూములలో భద్రపరిచినట్లు తెలియజేశారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, పోలింగ్ సామాగ్రి భద్రపరిచే స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచల భద్రత కొనసాగుతుందని అందులో మొదటి వలయంలో కేంద్రబలగాలైన సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్ తో పహారా, రెండవ భాగంలో జిల్లా రిజర్వ్ పోలీసుతో పహారా, మూడవ భాగంలో పట్టణ పోలీసులతో గస్తీ నిర్వహిస్తూ, పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కౌంటింగ్ జరిగే వరకు ఈ భద్రత ఇలాగే కొనసాగుతుందని తెలియజేశారు. భద్రతలో భాగంగా వర్షాలు ఈదురు గాలులు లాంటి ఆపత్కాల ఘటనలకు తట్టుకునే విధంగా గట్టి రక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ స్ట్రాంగ్ రూములకు ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులను భద్రత ఇంచార్జిలుగా నియమించినట్లు తెలిపారు. అదనపు రక్షణ చర్యల్లో భాగంగా సీసీటీవీ కెమెరాలను అమర్చి నిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలియజేశారు. స్ట్రాంగ్ రూములను సందర్శించే ప్రతి ఒక్కరి సంతకం భద్రత అధికారులు రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని, సందర్శించిన సమయం, వెళ్లిన సమయం, నమోదు చేయాలని సూచించారు. ఏ సమయంలోనైనా ఆకస్మిక తనిఖీలు జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయాల్లో మూడు చోట్ల భవనాల చుట్టూ పెట్రోలింగ్, గస్తీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో ఏకలవ్య విద్యార్థుల సత్తా



నవతెలంగాణ-నార్నూర్

ఇటీవల వెలువడిన సీబీఎస్ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకులం పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరాములు విద్యార్థులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలలో మొత్తం 25 మంది పరీక్షలు రాయగా 25 మంది ఉత్తీర్ణత సాధించి, వంద శాతం ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం పాఠశాల సిబ్బందిని అభినందించారు.

సాయి చైతన్యకు సన్మానం



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని సేవాదాస్‌నగర్ నివాసి జాదవ్ సాయి చైతన్య 2023 సంవత్సరం యూపీఎస్సీలో రాసిన పరీక్షలో అల్ ఇండియా 131వ ర్యాంక్ సాధించారు. ఐఎఫ్ఎస్‌లో డీఎఫ్‌ఓ ఉద్యోగాన్ని సాధించుకున్నాడు. మంగళవారం సాయి చైతన్యను ఆర్ఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించి, మిఠాయిలు తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మెన్ జాదవ్ రాజేష్, దేవిదాస్, వీరేందర్, రవి, నగేష్, బి.రవీందర్ పాల్గొన్నారు.

హస్తం కార్యకర్తలను నమ్మించి నయవంచన

- బీజేపీ వద్ద పైసలు తీసుకుని కాంగ్రెస్‌కు ద్రోహం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను నమ్మించి నయవంచన చేశారని, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్‌రెడ్డి పార్టీ ద్రోహులని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, డబ్బుల సంచులు తీసుకుని తమ కార్యకర్తలను గందరగోళానికి గురిచేశారని వ్యాఖ్యనించారు. కాంగ్రెస్ పార్టీ కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునేవారికి కార్యకర్తలే సరైన బుద్ధిచెబుతారంటూ హితవు పలికారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వద్ద డబ్బులు తీసుకుని పార్టీ ద్రోహులుగా మిగిలిపోయారన్నారు. మళ్లీ ఈ పార్లమెంట్ ఎన్నికల్లోనూ బుద్ధి తెచ్చుకోకుండా బీజేపీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారంటూ విమర్శించారు. పైకి కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తున్నట్లు నటించి.. బీజేపీ దగ్గర డబ్బులు తీసుకున్నారని స్వయంగా ప్రజలే అంటున్నారన్నారు. సిగ్గులేకుండా వారు రాజకీయ వ్యభిచారానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీకి ఓట్లు వేయించినట్టు తెలుస్తోందని, పక్కా ఆధారాలతో త్వరలోనే వారి బండారం బయటపెడతామన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ పార్టీని ఏమీ చేయలేరన్నారు. అటు కొడుకు, అల్లుడిని అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే పాయల శంకర్ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయనకు డబ్బుమీద, తప్ప ప్రజలపై ప్రేమలేదన్నారు. అదే ఆయనను రాజకీయంగా భస్మం చేస్తుందంటూ జోస్యం చెప్పారు. ఈ మీడియా సమావేశంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, ఆవుల వెంకన్న, సాయి ప్రణయ్, నాయకులు సుధాగోని సుధాకర్‌గౌడ్, గడ్డం జగదీష్ రెడ్డి, మునిగెల విఠల్, గంగారెడ్డి, తమ్మల చందు, కిజర్ పాషా, బూర్ల శంకరయ్య కయ్యుమ్, నూర్ ఖాన్, కయ్యుమ్, రజా, మున్నా, యోగేష్, వదూద్, అన్నెల శంకర్, వసంత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన



విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు ఖాయమని అన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అసత్య ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. బీజేపీ నాయకులు దేవుల పేర్లు చెప్పి, మత భేదాలు చేస్తూ ఓట్లు అడగడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే పథకాల గురించి ప్రజలకు వివరించమని అన్నారు. మేము దేవుల పేర్లు చెప్పి ఓట్లు అడగలేదని అన్నారు. ఎంపీ అభ్యర్థి సుగుణ మాట్లాడుతూ నేను గెలవడం ఖాయమని, ఖానాపూర్, ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేస్తానని, నా గెలుపు కోరకు సహాయ సహకారాలు అందించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రజలకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాకెట్ మనీ అన్నదానానికి విరాళంగా అందజేత

నవతెలంగాణ-బోథ్



తాను దాచుకున్న ప్యాకెట్ మనీని ఓ చిన్నారి అన్నదానానికి విరాళంగా అందజేసింది. ఆట పాటలతో గడపాల్సిన సమయంలో సమాజ హితాన్ని కోరుతోంది. అమ్మనాన్నలు ఇచ్చిన డబ్బులను జమ చేసుకున్న ప్యాకేట్ మణిని మన ఐక్యత సేవ సమితికి మంగళవారం అందజేసింది. మండల కేంద్రానికి చెందిన నేహ దేవేందర్ దంపతుల కుమార్తె మంజరి శ్రిజ్ఞ తన జన్మదినాన్ని పురస్కరించుకొని తాను దాచుకున్న డబ్బును అందజేయడంతో చిన్నారిని పలువురు అభినందించారు.

మెజారిటీతో గెలుస్తున్నాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నరేంద్రమోడీని మూడోసారి ప్రధానిని చేయాలన్న లక్ష్యంతో ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని, ఆదిలాబాద్ పార్లమెంట్‌లో మెజారిటీతో తాను గెలుస్తున్నట్టు బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. గత కొద్ది రోజులుగా హోరాహోరిగా జరిగిన ప్రచార కార్యక్రమంలో సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో బీజేపీ పార్టీ గెలుస్తుందని అన్నారు. బీజేపీకి ఓటేయడానికి ఇతర దేశ విదేశాల నుంచి వచ్చి ఓటేసి తనను కలిశారని తెలిపారు. సమావేశంలో నాయకులు ఉన్నారు.

నేడు దివ్యాంగుల బస్‌పాస్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోని బస్సు పాస్ కౌంటర్ వద్ద 15న బుధవారం దివ్యాంగుల కోసం బస్‌పాస్ మేళా ఏర్పాటు చేయడం జరుగుతుందని డిపో మేనేజర్ కల్పన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్ పాస్ కోసం సదరం సర్టిఫికెట్ ఒరిజినల్, జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో తీసుకోరావాలని సూచించారు. అలాగే రుసుము రూ.50 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండలంలో 73 శాతం పోలింగ్

నవతెలంగాణ - వాంకిడి

పార్లమెంటు ఎన్నికల్లో మండలంలో 73 శాతం పోలింగ్ నమోదైంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థికే ఎక్కువ శాతం ఓట్లు వచ్చినట్టు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చర్చలు జరుపుతున్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల్లో రానున్న విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్‌లో ప్రవేశం, ఎంసెట్ కోచింగ్ కోసం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు పదవ తరగతిలో మెరిట్ ఆధారంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ నెల 30లోపు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.తెలంగాణ ఈ పాస్.సీజీజీ.గౌవ్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తుంది : జడ్పీటీసీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆసిఫాబాద్ జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రాపల్లితో పాటు వివిధ గ్రామపంచాయతీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బిజెపి ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. దేశంలో మూడోసారి మోడీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, వైస్ ఎంపీపీ పెంటయ్య, నాయకులు ప్రహ్లాద్, నారాయణ, శేఖర్, సాయి, హనుమంతు, విజయ్, సుధాకర్, తిరుమల, వెంకటేష్, ప్రవీణ్, సంతోష్ పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ ప్రక్రియ అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) లను ఓట్ల లెక్కింపు కేంద్రమైన జిల్లాలోని మూడు కౌంటింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం జరిగిందని సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సెగ్మెంట్ల నుంచి తరలించిన ఈవీఎంలను జాగ్రత్తగా సరిచూసుకుని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల కనుగుణంగా వాటిని స్ట్రాంగ్ రూమ్‌లలో నియోజకవర్గాల వారీగా అమర్చడం జరిగిందని తెలిపారు. మంగళవారం ఉదయం అభ్యర్థుల ఏజెంట్లు, ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజర్షిషా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ లకు సీల్ వేశారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన ఆదిలాబాద్, బోథ్ ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించిన అనంతరం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం గోదాంను పరిశీలించారు. అనంతరం ఆదిలాబాద్‌లోని సంజయ్‌గాంధీ పాలిటెక్నికల్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన నిర్మల్, ముథోల్, ఖానాపూర్, స్ట్రాంగ్ రూమ్‌లలో, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన సిర్పూర్, ఆసిఫాబాద్ స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరిచి, ఈవీఎంల భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, టీటీడీసీలో మూడు జిల్లాలకు సంబంధించిన అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో స్క్రూటినీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్‌లు శ్యామలాదేవి, దీపక్ తివారి, డీఆర్ఓ లోకేష్, ఆర్డీఓలు వినోద్, రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, జీవాకర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై కేసు పెట్టిన ఆత్రం సుగుణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో దౌర్జన్యంగా ప్రవర్తించి భౌతిక దాడులకు పాల్పడిన బీజేపీ నాయకులపై, రౌడీ షీటర్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధిత మహిళలతో కలిసి ఫిర్యాదు చేశారు. అరెస్ట్ అయిన అమాయకులైన యువకులను వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా దుర్భషలాడిన ఎమ్మెల్యే పాయల శంకర్ తనయుడిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆయన అండదండలతో రెచ్చిపోయిన తిర్పెల్లి, ఖిల్లా పర్కోట కాలనీకి చెందిన గొర్ల రాము, అతని సోదరుడు రాకేష్‌పై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కాలనీ మైనారిటీ మహిళలను అసభ్యంగా వారి వస్త్రధారణపై కామెంట్స్ చేయడం, ఓటువేసే సమయానికి అడ్డు పడటం వంటి చర్యలకు పాల్పడినట్టుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. వారు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారని, గందరగోళానికి గురిచేశారని అన్నారు. అడ్డొచ్చినవారిపై ఎదురు దాడులకు పాల్పడటం దుర్మార్గమని పేర్కొన్నారు. పైగా దాడులకు పాల్పడిన బీజేపీ నాయకులే పోలీసులతో అమాయకులైన యువకులను అరెస్ట్ చేయించడం విడ్డూరమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలన్నారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా పోలీసులు చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని తిర్పెల్లి కాలనీలోని బాధితుల ఇంటి వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. ఘటనపై వివరాలు ఆరాతీశారు. అధైర్యపడొద్దని వారికి ఇరువురు నాయకులు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి వెంట నాయకులు ఉన్నారు.

నిట్టనిలువునా రైతు దోపిడీ

- తూకంలో మోసం చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు
- రైతులే గుర్తించి నిలదీసిన వైనం
- దహెగాం మండలం ఒడ్డుగూడలో నిర్వాహకుల తీరు



కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేస్తున్న రైతులు



తూకంలో మోసాన్ని విలేకరులకు చూపిస్తున్న రైతులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన రైతు నిలువునా మోసానికి గురవుతున్నాడు. ప్రకృతి ఆటుపోట్లను తట్టుకొని ఎంతో కొంత చేతికి వచ్చిన పంటకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించక రైతు దగా పడుతుండగా, కొత్తగా సహకార సంఘాల నిర్వాహకులు కూడా తూకంలో మోసం చేస్తూ రైతులను మోసం చేస్తున్న వైనం దహెగాం మండలం ఒడ్డుగూడలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. దహెగాం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఒడ్డుగూడ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో గత కొన్ని రోజుల నుండి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. మంగళవారం కూడా వరి ధాన్యం కొనుగోలు చేస్తుండగా ఒక రైతుకు తూకంపై అనుమానం వచ్చింది. వాస్తవానికి 40.500 కిలోల బస్తాను తూకం వేసి అందులో నుండి బస్తా బరువు పేరిట 500 గ్రాములు తగ్గిస్తారు. 40 కిలోల ధాన్యానికి ధర నిర్ణయిస్తారు. ఈ కేంద్రంలో కూడా ఇదే విధంగా తూకం వేస్తున్నారు. కాని 42 కిలోల నుండి 43 కిలోల వరి ధాన్యాన్ని తూకం వేస్తే 40.500 కిలోల వరి ధాన్యం తూకం వేసినట్లుగా చూపించే విధంగా నిర్వాహకులు ఆ తూకాన్ని సవరించారు. మంగళవారం కేంద్రానికి వచ్చిన రైతు రౌతు సత్తన్న కల్లం వద్దే నిర్వాహకులు ధాన్యం తూకం వేశారు. కాని రైతుకు తూకంపై అనుమానం రాగా ఆ ధాన్యాన్ని పక్కనే ఉన్న ప్రైవేట్ ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లి అక్కడ తూకం వేశాడు. అక్కడికి, ఇక్కడికి తేడా ఉండడంతో రైతులు వెళ్లి నిర్వాహకులను నిలదీశారు. వారు తేడా ఉన్నట్లు అంగీకరించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న సహకార సంఘం సీఈఓ బక్కయ్య అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. వెంటనే నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. అనంతరం కేంద్రం నిర్వాహకుడు తుమ్మిడె నారాయణ కల్లం వద్దకు వచ్చి రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. అయినా రైతులు వినకుండా స్థానిక ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయడమే కాకుండా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఒకరోజు ముందు 220 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు

ఒకరోజు ముందు ఈ కొనుగోలు కేంద్రం నుండే 220 క్వింటాళ్ల వరి ధాన్యం మిల్లర్లకు పంపించారు. ఈ ధాన్యం విక్రయించిన రైతులు కూడా ఇప్పుడు ఆందోళనకు దిగారు. తమ ధాన్యం తూకంలో కూడా మోసం జరిగి ఉంటుందని, దీనిపై వివరాలు రాబట్టాలని సీఈఓ బక్కయ్యను వారు నిలదీయడంతో మిల్లర్లకు ఈ కేంద్రం నుండి రవాణా అయిన ధాన్యం వివరాలను సేకరించారు. నాలుగు క్వింటాళ్ల వరి ధాన్యం అధికంగా వచ్చినట్లు సదరు మిల్లర్ల ద్వారా తెలిసినట్లు సీఈఓ బక్కయ్య తెలిపారు. ఈ తూకంలో జరుగుతున్న మోసం విషయంలో కేంద్రం నిర్వాహకుల హస్తంతో పాటు సహకార సంఘం నాయకుల హస్తం కూడా ఉందా అనే విషయంలో లోతుగా విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

భగీరథా..ఏమిటీ గోస..!

- ప్రధాన్‌గూడలో నీటి ఎద్దడి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

తెలంగాణ ప్రభుత్వం తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, భగీరథా కార్యక్రమాన్ని చేపట్టింది. దీంట్లో భాగంగా పట్టణాలకు, గ్రామాలకు, తండాలకు, గూడెలకు మిషన్ భగీరథ తాగు నీటి ట్యాంకులను నిర్మించింది. వాటి ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఇంటికి నల్లా ఉన్నా నీళ్ల మాత్రం రావడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. వేసవి కాలం నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. దీంతో గ్రామాల్లో తీవ్రంగా తాగునీటి కొరత ఏర్పడుతుంది. పెద్దపెద్ద ప్రాజెక్టుల నుంచి మిషన్ భగీరథ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్ల రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన్‌గూడాలో సుమారు 2వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. వారికి గత వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని, ప్రయివేటు బోర్ల వద్దకు వెళ్లి రోజు నీళ్ల తీసుకువస్తున్నామని అన్నారు. ప్రయివేటు బోర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. మిషన్ భగీరథ ఎప్పుడొస్తుందో అధికారులకే తెలియడం లేదని పలువురు ఆరోపించారు. తాగునీటి సమస్య తలెత్తడంతో తాము ఉపాధి హామీ పనులకు వెళ్లలేక పోతున్నామని అన్నారు. ఒక బిందెడు నీళ్ల కోసం కుటుంబం మొత్తం సమయం కేటాయించాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు తమకు నీటి గోసను తీర్చాలని ఆ కాలనీ వాసులు పేర్కొంటున్నారు.





మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు

గేడం దినేష్, ప్రధాన్‌గూడ



తమ కాలనీకీ వారానికి ఒక్క సారి సైతం మిషన్ భగీరథ నీళ్లు అందడం లేదు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. లక్షల నిధులు వెచ్చించి, నిర్మించిన ట్యాంకు అలంకార ప్రాయంగా దర్శనమిస్తోంది.

వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు

గేడం గిరిజబాయి, ప్రధాన్‌గూడ



వారం రోజులుగా తమ కాలనికీ మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. ఉన్నా ఒకే బోరు నుంచి నీళ్లు తీసుకు రావడానికి ఇబ్బందులు పడుతున్నాం.

ఎమ్మెల్యేలకు అగ్నిపరీక్ష..!

- లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ
- కార్యకర్తల సమీక్షలతో నాయకులు బిజీ బిజీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇక ఎన్నికల ఫలితాల వెల్లడే మిగిలింది. ఈ ఫలితాల కోసం అభ్యర్థులతో పాటు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. గతంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఫలితాల వెల్లడికి ముందే అభ్యర్థుల గెలుపోటములపై ఒక అంచనా ఉండేది. కాని ఈ ఎన్నికల ఫలితాలపై స్పష్టంగా అంచనాకు రాలేకపోతున్నారు. తమ పార్టీకి చెందిన అభ్యర్థే విజయం సాధిస్తాడని ఆయా పార్టీల నాయకులు పైకి చెపుతున్నా లోలోపల మాత్రం కాస్త ఆందోళనే నెలకొని ఉంది. ఈ లోక్‌సభ ఎన్నికలు ఎమ్మెల్యేలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఐదు నెలలు కాకముందే లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలలో వచ్చిన ఫలితాలపై తమ భవితవ్యం ఆధారపడి ఉంటుందనే అభిప్రాయం ఎమ్మెల్యేలలో నెలకొని ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. కాని ఈ ఫలితాలు తమకు అనుకూలంగా ఉంటాయా, ప్రతికూలంగా ఉంటాయా అనే విషయంలో ఉత్కంఠ నెలకొంది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఉండగా, అక్కడ కాంగ్రెస్ పార్టీ బలంగా ఉంది. అక్కడి జెడ్పీటీసీ, సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు ఇటీవలే బీజేపీలో చేరడంతో బీజేపీ కూడా బలంగా తయారైంది. ఈ నియోజకవర్గంలో ప్రధానంగా ఈ మూడు పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు మద్దతుగా ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రచారం చేసింది. దీనికి తోడు అభ్యర్థి ఆత్రం సక్కు స్థానికుడు కావడం, ఈ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఒక పర్యాయం గెలుపొందడంతో లోక్‌సభ ఎన్నికలలో మిగిలిన రెండు పార్టీల అభ్యర్థులకు గట్టి పోటీనే ఇచ్చాడు. ఇక్కడి నుండి బీఆర్ఎస్ అభ్యర్థికి మెజార్టీ ఓట్లు వస్తే కోవ లక్ష్మికి అధిష్టానం వద్ద గుర్తింపు లభించే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆత్రం సక్కుకు వచ్చే ఓట్లు ఆమె రాజకీయ భవితవ్యంపై ప్రభావం చూపుతాయా అనేది చూడాలి.

సిర్పూరులో హరీష్‌బాబుకు సవాల్

సిర్పూరులో ఈ ఎన్నికలను ఎమ్మెల్యే హరీష్‌బాబు ఒక సవాల్‌గా స్వీకరించి ప్రచారం చేపట్టారు. బీజేపీ అభ్యర్థి జి నగేష్ విజయం కోసం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్ని మండలాలలో ప్రచారం చేపట్టారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలు, ఎంపీగా నగేష్‌ను కూడా గెలిపిస్తే తాము జోడెద్దుల్లా పని చేస్తామని ఆయన ప్రజలకు వివరించి చెప్పే ప్రయత్నం చేశారు. కేంద్రంలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని, బీజేపీని గెలిపిస్తేనే కేంద్రం నుండి అధిక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన హామీలిచ్చారు. ఒక పర్యాయం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కాగజ్‌నగర్‌కు తీసుకువచ్చి బహిరంగ సభ నిర్వహించారు. ఈ నియోజకవర్గం నుండి బీజేపీ అభ్యర్థి నగేష్‌కు అధిక మెజార్టీ వస్తుందనే ధీమాలో ఆయన ఉన్నారు. మంగళవారం ఆయన బూత్‌ల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష జరిపారు. ఈ సమీక్షలో ఫలితాలు తమకు అనుకూలంగా ఉన్నాయనే విషయాన్ని ఆయన వెల్లడించారు. ఇక్కడి నుండి బీజేపీ అభ్యర్థికి వచ్చే ఓట్ల శాతం పార్టీలో ఆయన స్థానాన్ని నిర్ణయిస్తుందని చెప్పవచ్చు.



కాగజ్‌నగర్‌లో సమీక్ష జరుపుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కేంద్ర బలగాలకు సత్కారం



తెలంగాణ-తాండూర్

పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా బెల్లంపల్లిలో విధులు నిర్వహించిన బీఎస్ఎఫ్ ఎఫ్‌జీ 160వ బెటాలియన్‌కు చెందిన డేవిడ్ లాల్‌ను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా బేటాలియన్ అధికారులు సిబ్బంది, నిబద్ధతతో వారికి అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, తాళ్లగురిజాల ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గడ్డం వంశీకృష్ణ

నవతెలంగాణ-జైపూర్



పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన అనంతరం మంగళవారం కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ హైదరాబాదులో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తన తండ్రి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామితో సీఎంను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

టీచర్లపై లాఠీచార్జి చేయించిన ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ సిటీ : ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఒపై చర్యతీసుకోవాలని టిఎస్ యుటిఎఫ్ నిజామాబాద్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.సత్యానంద్, ఒ.రమేష్ డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం టిఏ, డీఏ చెల్లించాలన్నందుకు పోలీసుల బలప్రయోగం ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తూ బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయు లపై పోలీసులతో లాఠీ చార్జి చేయించిన అధికారులపై, లాఠీలతో దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఒ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని అన్నారు. అధికారులు నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఒ, పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

16న కబడ్డీ సెలక్షన్స్

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 16 ఉదయం 10 గంటలకు ముప్కాల్ గ్రామీణ క్రీడా ప్రాంగణం 'చైతన్య నెహ్రూ యువజన సంఘం' క్రీడా మైదానంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో సబ్ జూనియర్, జూని యర్ విభాగంలో 'అండర్-16, అండర్-20 బాలుర' కు సెలక్షన్స్ నిర్వహిం చడం జరుగుతుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ రెడ్డి మంగళవారం రోజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 18 నుండి జూన్ 1 వరకు కబడ్డీ శిక్షణ తరగతులు 'సమ్మర్ స్పెషల్ క్యాంపు' నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో క్రీడాకారులకు భోజన వసతి, అకామిడేషన్ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నలుమూలల గల క్రీడాకారులు ఈ విషయాన్ని గ్రహించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఈ కింది 9989814410 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉమ్మడి కుటుంబాలు చిన్నాభిన్నం

- ఉపాధి లేక బంధాలకు దూరమవుతున్న వైనం
- నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం



నవతెలంగాణ-తాండూర్

భారతీయ సాంప్రదాయంలో మూలాధారమైన కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతోంది. కుటుంబ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోవడంలో విఫలమవుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య ఎడబాటు పెరిగిపోతుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటంతో వృద్ధుల చిన్నారులు తమ హక్కులను కోల్పోతున్నారు. కుటుంబ పోషణ కోసం ఉపాధి మార్గాలు అన్వేశిస్తూ కుటుంబ సభ్యులకు దూరంగా జీవిస్తున్నారు. ఇలా ఎన్నో కుటుంబాలు ఉపాధి కోసం ఇతర దేశాలు, ప్రాంతాలకు వలసవెళ్లి అనుబందాలకు దూరమవుతున్నాయి. ప్రభుత్వాలు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తే తప్ప భరతీయ కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా ఉండే అవశాలు ఉంటాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కనీస అవసరాల కోసం కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు.

ఉపాధి మార్గాలను చూపించాలి

ప్రభుత్వం కుటుంబ వ్యవస్థ బలోపేతం చేసేందుకు స్థానికంగా ఉపాధి మార్గాలు చూపాలి. వ్యవసాయ వ్యవసాయేతర రంగాల అభివృద్ధితోపాటు, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్వయం ఉపాధి రుణాలు ఇచ్చి స్థానిక వనరులను ఉపయోగించుకునేవిదంగా ప్రోత్సహించాలి. కుటుంబ సభ్యులకు సమిష్టి రుణాలను అందించాలి స్థానికంగా వనరులను ఉపయోగించుకొని పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. వలసలను నివారించేందుకు ఉపాధి మార్గాలను చూపాలి. ఉమ్మడి వ్యవసాయం భాగస్వామ్య వ్యాపారాలకు దీర్ఘకాలిక రుణాలను అందించాలి.

ఉపాధి కోసం దూరమవుతున్నాం

మాసాడి తిరుపతి, మాజీ సర్పంచ్, బోయపల్లి

మాది ఉమ్మడి కుటుంబం బోయపల్లి గ్రామాల్లో ఒకేచోట కలిసిమెలిసి ఉంటున్నాం. మా పిల్లలు ఉపాధి కోసం హైదరాబాదు పరిసర ప్రాంతాలకు వలస వెళ్లడంతో ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం అయింది. స్థానికంగా ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లయితే ఆప్యాయతలు అనురాగాల మధ్య కుటుంబ బాంధవ్యాలతో జీవనాన్ని కొనసాగించేవారం. ప్రస్తుతం బతుకుదెరువు కోసం వేరే ప్రాంతాలకు వలసలు వెళ్లడం వల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమయింది. ప్రభుత్వం గ్రామస్థాయిలో సమిష్టి కుటుంబాలకు అవసరమయ్యే ఉపాధి మార్గాలను అన్వేషించాలి. కుటీర పరిశ్రమలకు చేయూతనివ్వాలి భాగస్వామ్య వ్యాపారాలకు రుణాల అందించాలి వ్యవసాయ అనుబంధాలకు ప్రోత్సాహాన్ని అందించాలి.

జిల్లాలో ప్రశాంతంగా లోక్ సభ ఎన్నికలు

- జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్



నవతెలంగాణ-హాజీపూర్

పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13న నిర్వహించిన ఎంపీ ఎన్నికలు అందరి సహకారంతో ప్రశాంతంగా నిర్వహిచగలిగామని జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కలలోని ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో గల స్ట్రాంగ్ రూమ్ లలో పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సమీర్ నైరంతర్య సమక్షంలో అదనపు కలెక్టర్, బెల్లంపల్లి సహాయ రిటర్నింగ్ అధికారి బి.రాహుల్, డీసీపీ అశోక్ కుమార్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ ముగిసిందని, జూన్ 4వ తేదీన కౌంటింగ్ కార్యక్రమం ఉంటుందని, 6వ తేదీ వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం అహర్నిశలు కృషి చేసిందని, ఈ క్రమంలో రాజకీయ పార్టీలు సహకరించడం సంతోషంగా ఉందని, జిల్లాలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ కొరకు 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో త్రాగునీరు, నీడ, ఫ్యాన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, ర్యాంపులు, మూత్రశాలల సౌకర్యాలతో పాటు వేసవి దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.

ప్రేమించుకున్నారు.. ఒక్కటయ్యారు..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని గడ్కోల్ గ్రామానికి చెందిన హరిని, ఇందల్ వాయి మండలంలోని ఇందల్ వాయి గ్రామానికి చెందిన నిఖిల్‌లు గత కొన్ని నెలలుగా ఒకరినొ కరు ప్రేమించుకున్నారు. మంగళవారం హరిని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దానిలో బాగంగా ఇరువురి కుంటుంట సభ్యులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని స్టడీ సర్టిఫికెట్‌లను ఎస్సై మనోజ్ కుమార్‌కు చూయించారు. చదువు సర్టిఫికెట్ ఆధారంగానే ఇద్దరు పెళ్ళీ వయస్సులో ఉన్నట్లు గుర్తించారు. హరిని కుటుంబ సభ్యులు మాత్రం ఇంకా హరినికి నాలుగు నెలలు తక్కువ గా ఉన్నాయని తెలుపగా చదువుకున్న సర్టిఫికెట్‌లలో మాత్రం 18ఏళ్ళు దాటి నట్లు ఉండటం, కుటుంబ సభ్యు లు ఎంత నచ్చుచెప్పిన హరిని మాత్రం నిఖిల్ తోనే ఉంటా నని, ఇప్పటికే తాము ఆలయంలో పెళ్లి చేసుకున్నామని, ఒకటి రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ మ్యారేజ్ చేసుకుంటామని చెప్పారు. పోలీస్ స్టేషన్ లో సైతం ఇరువురు ప్రేమికులు పుల దండలు మార్చుకున్నారు.

నిరుపయోగంగా పల్లె దవాఖానా

- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ప్రారంబానికి నోచుకోని నూతన భవనం
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలు

అధికార్ల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల పట్టింపులేని తనంతో కలమడుగు పల్లె దవఖాన భవన నిర్మాణం పూర్తైనప్పటికీ ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రజలకు స్థానికంగా వైద్య సదుపాయం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఆస్పత్రి వినియోగానికి నోచుకోవడం లేదు. ఆస్పత్రిలో ఓ డాక్టర్‌ను, ముగ్గురు ఆరోగ్య సిబ్బందిని నియమించిప్పటికి పక్కా భవనం పూర్తైనా ప్రారంభం కాక ఆ ప్రాంత ప్రజలకు వైద్యం అందడం లేదు.



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో 24 గంటలు పని చేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. మండలంలోని 29 గ్రామపంచాయతీ ప్రజలు ఈ ప్రాథమిక కేంద్రానికి వచ్చి వైద్యం చేసుకుంటున్నారు. వైద్యాన్ని పేద ప్రజలకు చెరువ చేయడం కోసం పల్లె దవఖానను ఏర్పాటు చేశారు. మండలంలోని కలమడుగు, ధర్మారం, కిష్టాపూర్, కామన్‌పల్లి, రోటిగూడ గ్రామాలలో పల్లె దవఖానలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. రూ.16 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో మండలంలోని కలమడుగు గ్రామంలో పల్లె దవఖాన భవన నిర్మాణ పనులు చేపట్టారు. మండలంలోని రాంపూర్‌కు చెందిన చెన్నాడి రమేష్‌రావు నిర్మాణ పనులు చేపట్టేందుకు టెండర్ దక్కించుకున్నారు. ఆ తర్వాత భవన నిర్మాణ పనులు పూర్తై ఆరు నెలలు గడు స్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆ భవనానికి రూ.లక్ష పదివేలతో ఫర్నిచర్ ఇతర సామగ్రికి నిధుల మంజూర య్యాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతి నిధుల పట్టింపులేని తనంతో ఇప్పటి వరకు ఆ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు వైద్యం కోసం 7,8 కిలో మీటర్ల దూరంలోని మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వెళ్తున్నారు.

పనులకు నోచుకోని మరో నాల్గు భవనాలు

మండలంలోని ధర్మారం, కిష్టాపూర్, కామన్ పల్లి, రోటిగూడ గ్రామాలకు మరో నాలుగు భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున రూ.80 లక్షలు డీఎంఎఫటీ నిధులు మంజూరు చేశారు. నిర్మాణానికి టెండర్లు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్లు చిన్న చిన్న కారణాలతో ఇంతవకరు పనులు ప్రారంభించలేదు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చర్యలు తీసుకుని పూర్తైన భవనాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రారంభించేందుకు చర్యలు చేపడతాం

గోల్కొండ ఉమాశ్రీ, మండల వైద్యాధికారి


ఉన్నతాధికారులను సంప్రదించి త్వరలోనే కలమడుగు పల్లె దవఖానా నూతన భవనాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. ఎన్నికలు రావడంతో కొంత జాప్యం జరిగింది. జిల్లా వైద్యాధికారితో, ఎంపీటితో సంప్రదించి త్వరలోనే ప్రారంభిస్తాం. మిగతా గ్రామాల్లో భవన నిర్మాణాలను చేపట్టడానికి చర్యలు తీసుకోనున్నటున్నాం.

మేకలమండి టెండర్‌దారునికి నోటీసు

- మళ్లీ టెండర్ వేస్తామంటున్న మున్సిపల్ అధికారులు

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో గల మేకల మండిని టెండర్ ద్వారా ఒక సంవత్సర కాలం వరకు దక్కించుకున్న సదరు వ్యాపారస్తుడు టెండర్ నిర్వహణలో ఉన్న నిబంధనల ప్రకారం దక్కించుకున్న మేకల మండి నిర్వహణకు డబ్బులు కట్టకపోవడంతో మంచిర్యాల మున్సిపాలిటీ అధికారులు సదరు వ్యాపారికి నోటీసులు అందించారు. మార్చి 16న మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన టెండర్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని మేకల మండీని మంచిర్యాలకు చెందిన బొంబత్తుల శంకర్ అనే వ్యక్తి టెండర్ ద్వారా రూ.22,00,000 లకు దక్కించుకున్నారు. దీనికి మున్సిపల్ సభ్యులు ఆమోదము తెలిపారు. ఇట్టి టెండర్ సంవత్సరకాలం వరకు వర్తిస్తుంది. జీఎస్‌టీతో కలిపి మొత్తము రూ.25,96,000ను టెండర్ కాపీలో ఇచ్చిన నియమ నిబంధనల ప్రకారం ఏప్రిల్ 30 నాటికి చెల్లించాల్సి ఉండగా, గడువు ముగిసిన నాటికి రూ.25,96,000 కు గాను డిడి, నగదు రూపకంగా కలిపి కేవలం రూ.8,00,000 లక్షలు చెల్లించినట్లు, మున్సిపల్ అధికారులు తెలిపారు. మిగిలిన డబ్బులు చెల్లించనందుకు గాను వ్యాపారి శంకర్‌కు నోటీసులు అందించారు. అధికారులు నోటీసులపై సదరు వ్యాపారి స్పందించక పోవడంతో తీవ్ర విమర్శలు ఎదురవుతున్న దష్ట్యా టెండర్ రద్దు చేసి, తిరిగి మళ్లి టెండర్ నిర్వహించే పనిలో పడ్డారు. మున్సిపల్ అధికారులు గడువు ముగిసిప్పటికీ టెండర్ దక్కించుకున్న వ్యాపారి డబ్బులు కట్టి, రిజిస్ట్రేషన్ చేసుకోక పోవడంపై మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌ను వివరణ కోరగా నోటీసులు అందించామని, మున్సిపల్ చట్టం 2019 టెండర్ నియమ నిబంధనాల ప్రకారం మేకల మండిని దక్కించుకున్న సదరు వ్యాపారి డబ్బులు కట్టని యెడల ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లి టెండర్ నిర్వహిస్తామని తెలిపారు.



నోటీసు-2

తేది: 03-05-2024

3) వేలము యొక్క తేది: 16.03.2024.

4) కౌన్సిల్ తీర్మానము నెం. 332, తేది: 16-03-2024.

తేది: 16.03.2024

@ @ @

ఎన్నికల ఫలితాలపై బెట్టింగ్..!

- రూ.వేల నుంచి రూ. లక్షల్లో పందేలు
- 20 రోజులు ఉండడంతో పెరిగిన ఉత్కంఠ



నవతెలంగాణ-హాజీపూర్

పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తోడోనని ఓ వైపు ఉత్కంఠ నెలకొనగా మరో వైపు ఫలితాలపై బెట్టింగ్‌లు సైతం జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే నాదంటే నాదే గెలుపు అంటూ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తుండగా వీరికి తోడు అభ్యర్థి గెలుపుపై సొంత పార్టీల్లోనే కాదు ఇతరులు సైతం బెట్టింగ్ లకు తెరలేపుతున్నారు. ఇంకా 20 రోజులు ఉండటంతో బెట్టింగ్ అంటే తెలియని వారు కూడా బెట్టింగ్ రాయుళ్లుగా మారుతుండటంతో పందేలు పెరుగుతున్నారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థులుగా 42 మంది బరిలో ఉండగా ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్యనే ప్రధాన పోటీ నెలకొని ఉంది. అయినప్పటికీ బీఎస్పీతో పాటు ఇతర స్వతంత్ర అభ్యర్థులు సైతం గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన పార్టీల అభ్యర్థులకే ప్రాధాన్యం

బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకష్ణ గెలుపోటములపై బెట్టింగ్ మాత్రం జోరుగా సాగుతోంది. గ్రామాల్లో వెల్లువెత్తిన ఓటరు చైతన్యంతో పాటు పెరిగిన ఓటింగ్ శాతంతో గెలుపుపై ఈ బెట్టింగ్‌లు ఆగడం లేదు. ఏ నలుగురు కలిసినా, కూడళ్లలో, ఛాయ్ హోటళ్లో చూసినా అభ్యర్థుల విజయావకాశాలపై ఆరా తీస్తూ ఉన్న సమాచారంతో జయాపజయాలపై పందేలు పెట్టేసుకుంటున్నారు. ఈ బెట్టింగ్‌లు రూ.వేల నుంచి మొదలు రూ.లక్షల్లో సాగుతుండగా వీటిల్లో టూర్లు, దావత్లు ఇంకా ఎన్నో రకాలుగా కూడా ఉంటున్నాయి. ఇక బెట్టింగ్ ఇలా ఉంటే ఎవరు గెలుస్తారని ఇటు స్నేహితులే కాదు బంధువులు, ఇతర ప్రాంతాల్లోని వారు వివిధ స్థాయిల్లో ఆరా తీస్తున్నారు. ఏది ఏమైనా ఫలితాల నిరీక్షణకు 20 రోజులు ఉండగా అభ్యర్థుల గెలుపుపై ఇంకా బెట్టింగ్లు పెరిగే అవకాశంఉంది. ఈ బెట్టింగ్లు ఎవ్వరిని ఏ విధంగా నిలబెడుతాయో చూడాలంటే ఇరవై రోజులు వేచిచూడక తప్పదు.

సిబిఎస్ఈ ఫలితాల్లో క్షత్రియ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-ఆర్మూర్

సిబిఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో మండలంలోని చేపూర్ క్షత్రియ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. 97శాతం ఉత్తీర్ణతను పాఠశాల సాధించింది. పాఠశాలలో అత్యధిక ఉత్తీర్ణత సాధించారు. వెలుమల శ్రీకాంత్ 89శాతం, మైలారం వర్షిత్ రెడ్డి 84శాతం, దుబ్బాక మధురిమ 82శాతం, కొండం వేదశ్రీ 80శాతం ఇలా మరెన్నో ఉత్తీర్ణత శాతాన్ని క్షత్రియ విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా క్షత్రియ విద్యాసంస్థల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహ స్వామి విద్యార్థులను మంగళవారం ఘనంగా సన్మానించారు. డిసెంబర్ నుండి ఫైనల్ పరీక్షల వరకు 62 రోజుల పాటు నిరంతరంగా నిర్వహించిన ఇంటెన్సివ్ కోచింగ్‌లో ప్రతి పాఠంలో నుండి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరించి, చదివించడం జరిగిందని ప్రిన్సిపల్ పి. లక్ష్మీ నరసింహస్వామి తెలిపారు. క్షత్రియ విద్యా సంస్థల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ తమ సందేశంలో సిబిఎస్ఇ పదవ తరగతిలో ఈ ఫలితాలు రావడం మామూలు విషయం కాదని పేర్కొన్నారు. ఇంతటి ఘనత సాధించిన విద్యార్థులకు అధ్యాపకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేతల భవితకు 'భద్రత'

- స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎం, వీవీప్యాట్లు
- జూన్ 4న ముల్కల్లలో ఓట్ల లెక్కింపు



నవతెలంగాణ-హాజీపూర్

ఇంటింటా ప్రచారాలు.. సభలు, సమావేశాలు.. ర్యాలీలతో దాదాపు నెల రోజులుగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది. ఎన్నికల బరిలో ప్రధానంగా జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీఎస్పీలతో పాటు పలు రాష్ట్రీయ పార్టీలు ఉండగా మొత్తం 42 మంది బరిలో ఉన్నారు. ఎంపీ బరిలో ఉన్న అభ్యర్థులు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, బంధు, మిత్రగణంతో కలిసి తమ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. సోమవారం పోలింగ్ ముగియడంతో ఒక్కసారిగా అభ్యర్థులు ఉపశమనం పొందుతున్నారు. అయితే అభ్యర్థులు మాత్రం తమ గెలుపు-ఓటములపై అందరితో కలిసి విజయావకాశాలపై బేరీజులు వేస్తూ ఉన్నారు. అయితే ఫలితాలు కాస్త ఆలస్యం కానుండటంతో అంతా జూన్ 4 మంగళవారం రోజున వెలువడనున్న ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు.

ముల్కల్లలో మూడు నియోజక వర్గాల లెక్కింపు

మరోవైపు ఎన్నికల ఫలితాలను ప్రకటించేందుకు గాను ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. పోలింగ్ ముగిసిన అనంతరం మూడు నియోజకవర్గాల్లోని ఎన్నికలసామాగ్రి అంతా కూడా ఆయా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు చేరగా అక్కడి నుంచి లెక్కింపు కేంద్రానికి సోమవారం అర్ధరాత్రి వరకు తరలించారు. ఈవీఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీపాట్ యంత్రాలతో పాటు పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, మాక్ పోల్ ధ్రువ పత్రాలు, పీఓ డైరీ, టెండర్ బ్యాలెట్‌లు మండల కేంద్రంలోని స్ట్రాంగ్ రూముల్లోకి చేర్చారు. మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలోని లెక్కింపు కేంద్రానికి చేరుకున్నాయి. ఈ ప్రక్రియ అంతా కూడా మంగళవారం ఉదయం వరకు కొనసాగింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోశ్, రామగుండం పోలీస్ కమీషనరేట్ కమీషనర్ శ్రీనివాసులు కలిసి హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలోని లెక్కింపు కేంద్రంలోని స్ట్రాంగ్ రూముల్లో యంత్రాలను అత్యంత పటిష్ఠ బందోబస్తు మధ్య ప్రత్యేకంగా రూపొందించిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. అక్కడే సీసీ కెమెరాలతో పాటు కేంద్ర పోలీస్ బలగాలు, ఆర్మ్డ్ పోలీస్, సివిల్ పోలీసులు కూడా బందోబస్తులో భాగస్వామ్యం అయ్యారు.

ఓటరు సేవలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు



నవతెలంగాణ-లక్సెట్టిపేట

లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయించేందుకు లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు తమ వంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట ప్రాంతంలో ఎన్నికల కమిషనర్ ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు సహాయ చర్యలు చేపట్టారు. వద్దులను, దివ్యాంగులను పోలింగ్ కేంద్రాలకు తీసుకు రావడంతో పాటు వారు పోలింగ్ బూత్‌లోకి వెళ్ళడానికి సహాయం అందించారు. ఓటరు లిస్టులో పేర్లను వరుస సంఖ్యలను చెప్పడం, ఏ పోలింగ్ బూత్‌లో ఓటు వేయాలో సూచించడంలో సహాయ పడ్డారు. ఓటర్లు క్యూలో రావడానికి సహాయ పడ్డారు. క్యూలో ఉన్న వారికీ మంచినీరు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, వెంకటేష్, పింటు, కార్తీక్, విష్ణు విద్యార్థుల నాయకత్వంలో పలువురు వాలంటీర్లు ఓటరు సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. ఎన్నికల అధికారులు విద్యార్థుల సేవలను ప్రశంసించారు.

అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకోవాలి

నతెలంగాణ-మందమర్రి

తమ భూమిని జుమ్మిడి విశ్వనాథ్ అనే వ్యక్తి కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బాధిత మహిళ వడాల దుర్గమ్మ తెలిపారు. మంగళవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి వడాల దుర్గమ్మ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మందమర్రి శివారులోని సర్వే నంబర్ 146/63 తనకు చెందిన భూమిని జుమ్మిడి విశ్వనాథ్ కబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడతున్నాడని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో హైకోర్టును ఆశ్రయించడంతో డబ్ల్యూ పి 1659/2024 కేసు నమోదు చేసి అక్రమ నిర్మాణాలపై రెండు వారాల్లో చర్యలు తీసుకోవాలని 28/02/2024 తేదీన ఆర్డరు ఇచ్చినప్పటికీ మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. విశ్వనాథ్ అధికార పార్టీకి చెందిన వ్యక్తి అని వివేక్ అనుచరుడు కాబట్టి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించడం దారుణమని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని హైకోర్టు తీర్పును అమలు చేసి తమకు న్యాయం చేయాలని, తన అనుచరుల పద్ధతి మార్చుకోమని చెప్పి 1/70 యాక్ట్‌ను కాపాడాలని ఎమ్మెల్యే వివేక్ ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అనపర్తి మధుకర్, బీఆర్ఎస్ నాయకులు ఎంపీ గుణ, బొడ్డు వినోద, పద్మ పాల్గొన్నారు.

